క్లుప్తంగా

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



పాన్‌గల్: జిల్లా కేంద్రంలో ఈనెల 22న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(యూఈఈయూ) 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా నాయకుడు రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంఘం ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ ప్రణాళికలపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. సభలకు యూనియన్ రాష్ట్ర నాయకులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని యూనియన్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రకృతివనం ధ్వంసంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని మాస్టర్ మైండ్ పాఠశాల, జర్నలిస్టు కాలనీ పక్కన ఉన్న ప్రకృతి వనం (ట్రీ పార్కు)ను ధ్వంసం చేసిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు చేసిన ఈ దుశ్చర్యను ఖండిస్తూ గురువారం పెబ్బేరు మండల అఖిలపక్ష నాయకులు, స్థానిక ప్రజలు కలిసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అక్కి శ్రీనివాస్‌గౌడ్, విజయవర్ధన్‌రెడ్డి, గౌని హేమారెడ్డి, అక్కమ్మ, బుర్రమోని రాములు, రాములు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

మానవపాడు: మండలంలోని జల్లాపురం గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రంలో డాక్టర్ యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జల్లాపురం, చండూరు, బోరవెల్లి, పల్లెపాడు గ్రామాల్లోని 3నెలల నుంచి 9 నెలల గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించామని తెలిపారు. బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధులపై పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, ఆశలు, గర్భిణులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలప ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: అనుమతి లేకుండా తరలిస్తున్న కట్టెల ట్రాక్టర్‌ను ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మన్యం పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గద్వాలకు చెందిన ఓ కట్టెల వ్యాపారి కేటీదొడ్డి మండలంలో అక్రమంగా కట్టెలు కొట్టి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా గురువారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు గుర్తించి పట్టుకున్నారు. కట్టెల రవాణాకు సంబంధించి అనుమతులపై ఆరా తీయగా, ఏమీ లేవని డ్రైవర్ చెప్పడంతో ట్రాక్టర్‌ను గద్వాల అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా కలప తరలిస్తున్నారని డ్రైవర్, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమయ పాలన పాటించాలి



కేటీదొడ్డి: విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఎర్సందొడ్డి, చింతలకుంట, కేజీబీవీ పాఠశాలల్లో గురువారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మల్దకల్: ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని విఠలాపురం జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. బడిబయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

పశు సంపద వృద్ధికి చర్యలు



జగ్గాయిపల్లిలో పశువులకు చూడి పరీక్షలు చేస్తున్న పశు వైద్యులు

ఖిల్లాఘనపురం: సీజన్ల వారీగా పశువులకు చూడి పరీక్షలు చేయించి, అవసరమైన పశువులకు సూది మందులు వేయించాలని మండల పశువైద్యాధికారి సుస్సన్‌కేసి అన్నారు. గురువారం మండలంలోని జగ్గాయిపల్లిలో ఫెర్టిలిటీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 35 గేదెలకు చూడి పరీక్షలు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 25 లేగ దూడల ర్యాలీ నిర్వహించి దూడలకు అవసరమైన నట్టల నివారణ మందులు, అవసరమైన మందులను తాగించామన్నారు. గేదెలు సకాలంలో చూడికి రాకపోతే వైద్య సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. నిత్యం గ్రామాల్లో గోపాలమిత్రలు అందుబాటులో ఉంటారని, పాడి రైతులు వారి సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఎల్ఓ సుబ్బారెడ్డి, వీఏలు బద్రీనాథ్, మల్లేష్, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు జయసింహ, రాజవర్ధన్‌రెడ్డి, నారాయణ, కుర్మయ్య పలువురు రైతులు పాల్గొన్నారు.



పాడి రైతులకు దాణా, మందులు ఇస్తున్న సిబ్బంది

మేలు జాతి పశువులను పెంచుకోవాలి

పాడి రైతులు అధిగ పాల దిగుబడి కోసం మేలు జాతి పశువులను పెంచుకోవాలని డెయిరీ జోనల్ హెడ్ సత్యనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని జగ్గాయపల్లిలో పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ పాడి రైతులు అధిక పాల ఉత్పత్తి కోసం మేలు జాతి గేదెలు, ఆవులను ఎంపిక చేసుకోవాలన్నారు. అదేవిధంగా పశువులకు పోషక విలువలు కలిగిన పశువుల దాణా వినియోగించాలని సూచించారు. దాణ, మందులు మోతాదు ప్రకారం వాడటం వలన పాడి పశువులు ఆరోగ్యంగా ఉంటాయని వివరించారు. హెరిటేజ్ సంస్థ ద్వారా పాడి రైతులకు రూ.2 లక్షల ఉచిత ప్రమాదబీమా కల్పిస్తున్నామన్నారు. అదేవిధంగా సబ్సిడీపై దాణ, కాల్షియం, మినరల్ మిక్చర్, నట్టల నివారణ మందులు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ హెడ్ నర్సింగరావు, ప్లాంట్ మేనేజర్ రామకృష్ణ, సూపర్‌వైజర్ మహేందర్ పాడి రైతులు శివ, కురుమూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం



వీపనగండ్లలో పోలీసుల అదుపులో మాలమహానాడు నాయకులు



అమరచింతలో.. పోలీసుల అదుపులో..

అమరచింత: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ గురువారం మాల మహానాడు పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న తమను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు అన్నారు. మండల కేంద్రానికి చెందిన మాల మహానాడు సంఘానికి చెందిన సభ్యులను అమరచింత పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వీద విష్ణువర్ధన్, అలగనూరు రామస్వామి, రామ్మూర్తి ఉన్నారు.

వీపనగండ్ల: రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాస్తున్న పాలకుల తీరును నిరసిస్తూ రాష్ట్ర మాలమహానాడు నాయకులు గురువారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునివ్వగా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పలువురు మాలమహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఎస్సీలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ తాము ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు నిర్వహిస్తున్నామని మాలమహానాడు నాయకులు రామేశ్వర్‌రావు, బాబురావు, విజయ్, రంగస్వామి, నాగరాజు, నరేష్, జగదీశ్వర్, లక్ష్మయ్య, సూర్యనారాయణ అన్నారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలి



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓలు

పాన్‌గల్: ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని ఏఓ రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను వీపనగండ్ల ఏఓ డాకేశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన తనిఖీ చేసి రికార్డులను, ఎరువులను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని, ధరల వివరాలను దుకాణం ఎదుట ప్రదర్శించాలని ఆదేశించారు. కల్తీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే దుకాణ యజమానులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అపరిశుభ్రంగా పాఠశాల ఆవరణ



పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న గదిలో చెత్తాచెదారం

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని తాగునీటి కుళాయి వద్ద చెత్తాచెదారం ఉండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. విద్యార్థులు మధ్యాహ్న భోజనం తర్వాత తమ ప్లేట్లలో మిగిలిన అన్నంతో పాటు ఉపాధ్యాయులు తిని విసిరేసిన విస్తర్లు సైతం తాగునీటి కుళాయి సమీపంలోని నిర్మాణంలో ఉన్న గదిలో పడేయడంతో పరిసరాలు దుర్గంధంగా తయారయ్యాయి. దీని ద్వారా ఈగలు, దోమలు పెరిగి విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్వచ్ఛంద సంస్థ ఆర్థిక చేయూత



మల్లాయిపల్లి పాఠశాల ఆవరణలో గ్రామస్తులతో మాట్లాడుతున్న రోటరీ క్లబ్ ఫౌండేషన్ సభ్యులు

పాన్‌గల్: జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ వారి ఆర్థిక తోడ్పాటుతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ అన్నారు. గురువారం మండలంలోని మల్లాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, వివిధ అభివృద్ధి పనులకు జూబ్లీ

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన

హిల్స్ రోటరీ క్లబ్ రూ.10 లక్షలు కేటాయించడంతో రోటరీ క్లబ్ అధ్యక్షుడు విసిరెడ్డి బాలకోటిరెడ్డి, రోటరీ సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజాకృష్ణతో కలిసి పాఠశాలను సందర్శించి అభివృద్ధి పనులపై గ్రామస్తులు, ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి జూపల్లి నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా రత్నగిరి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి అరుణ్ కృషితో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీంతో పాటు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, కదిరెపాడు, శాగాపూర్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఆయా గ్రామాల నాయకులు, పాఠశాలల హెచ్ఎంలతో చేపట్టే అభివృద్ధి పనులపై ఆరా తీశారు.

'భగీరథ' పైప్‌లైన్ లీకేజీ



వనపర్తి రూరల్: మండలంలోని చిమనగుంటపల్లి పడమటితండా వెళ్లే దారిలో గ్రామంలోని వాటర్ ట్యాంక్‌కు వెళ్లే మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పోతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు లీకేజీల అరికట్టి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'దళితులను కాంగ్రెస్‌కు దూరం చేసే కుట్ర'



కొత్తకోటలో అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



అమరచింతలో..

సాక్షి, నెట్‌వర్క్: కాంగ్రెస్‌కు మద్దతుగా ఉన్న దళితులను దూరం చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి దుయ్యబట్టారు. బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు నివాళులర్పించి, అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు.

■ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో గురువారం సాయంత్రం చిన్నారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు చిన్నారెడ్డి 104 మందికి రూ.28.64లక్షల విలువ సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు.

■ కొత్తకోటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మదనాపురం మార్కెట్‌యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ అమిత్‌షాకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, బీచుపల్లి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, లతీఫ్, భాస్కర్, నరేందర్‌సాగర్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ అమరచింత పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తపరిచి, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తప్పించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మషప్ప, రవీందర్, భాస్కర్, అబ్రహం, ఎర్రన్న, శ్యాంసుందర్, సోలు తదితరులు పాల్గొన్నారు.

■ అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్‌షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బహుజన సమాజ్ పార్టీ దేవరకద్ర అసెంబ్లీ ఇన్‌చార్జీ జనుంపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు మాసన్న, నాయకులు కళ్యాణ్, కన్నయ్య, సంతోష్, మహేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

వేరుశనగకు మద్దతు ధర చట్టం తేవాలి



మార్కెట్ యార్డులో వేరుశనగను పరిశీలిస్తున్న పరమేశ్వరాచారి

వనపర్తి రూరల్: రైతులు పండించిన వేరుశనగ పంటలకు గిట్టుబాటు ధరల చట్టం తీసుకురావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి డిమాండ్ చేశారు. గురువారం ఆయన చిట్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్‌లో రైతులతో కలిసి వేరుశనగను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అయిదు నెలలు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నారన్నారు. పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారస్తులతో అప్పులు తీసుకొని పంటలు వేశారని, తీరా పంట చేతికి వచ్చేసరికి గిట్టుబాటు ధర లేక, తెచ్చిన అప్పులు తీరక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథం కమిటీ సిఫార్స్ ప్రకారం క్వింటాల్‌కు అదనంగా 50 శాతం ధర ఇవ్వాలన్నారు. వేరుశనగకు క్వింటాల్‌కు రూ.10 వేలు మద్దతు ధర కల్పించాలన్నారు. ఈ నెల 22న కేరళ సంఘీభావ జిల్లా సదస్సు ఉన్నందున రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఎల్ బీసన్న, తిరుపతి, వెంకటేష్, తిరుపతి, జగన్, సంజీవరెడ్డి, బాలస్వామి, రాజేష్, మన్నెమ్మ, లక్ష్మి, శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న బొబ్బిలి నిక్సన్

కొత్తకోట: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆశాలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో గురువారం ఆశా వర్కర్లను కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు రూ.18 వేలు ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదని మండిపడ్డారు. ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం చూపాలని కోరుతూ చేపట్టిన బస్సు యాత్ర ఈ నెల 23న వనపర్తికి చేరుకుంటుందన్నారు. ఆశాలకు ఇప్పటికే పనిభారం అధికమైన, వేతనాలు మాత్రం తక్కువగా ఇస్తున్నారని చెప్పారు. రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు జె.భాగ్య, సంతోష, పుష్ప, వరలక్ష్మి, పావని, భాగ్య, లక్ష్మి, గీత, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న మేకల ఆంజనేయులు

పాన్‌గల్: గుడిసెలు ఉన్న ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైనా ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని అధికారులను కోరారు. అర్హులైన పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోతే వారితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, ధర్నాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి రాజు, జయరాములు, శివ, బాల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే



కల్వరాల పాఠశాలలో కరాటే శిక్షణలో బాలికలు

వీపనగండ్ల: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు కరాటేను నేర్చుకోవడం వల్ల పలు రకాల ప్రయోజనాలు చేకూరుతాయని తైక్వాండో మాస్టర్ భాస్కర్ అన్నారు. గురువారం కల్వరాల ఉన్నత పాఠశాల ఆవరణలో అమ్మాయిలు కరాటే నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కరాటే విద్యలో ప్రావీణ్యం సంపాదిస్తే వారిని వారు కాపాడుకునేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం రాజవర్ధనాచారి, కళావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే



కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే పెద్దమందడి మండలంలో ముమ్మరంగా కొనసాగుతుంది. పామిరెడ్డిపల్లిలో 660 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని పంచాయతీ కార్యదర్శి స్రవంతి తెలిపారు. పథకానికి సంబంధించిన సర్వేను వేగంగా పూర్తి చేసి, నివేదికను ప్రభుత్వానికి సకాలంలో అందించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, శ్రీశైలం, చందు, నరేష్, కృష్ణ, నరసింహ తదితరులు ఉన్నారు.

దాతల సహకారంతో పాఠశాలకు దారి



మానవపాడు: మండల కేంద్రంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న రోడ్లను ఎంఈఓ శివప్రసాద్ పరిశీలించారు. దాతలు ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, రిటైర్ ప్రధానోపాధ్యాయురాలు ఈరమ్మ పాఠశాలకు వెళ్లే రోడ్డు సరిగా లేదని రూ. 20,600 వేలతో రెండు టిప్పర్ల మొర్రం వేయించి రోడ్డు మార్గాన్ని నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో రామేశ్వర్‌రెడ్డి, విజయమ్మ, శ్రీలేఖ, అలియా తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి



డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

వనపర్తి రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు పెంచి, బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు కోరారు. వేతనాలు పెంపు తదితర డిమాండ్లతో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధంతో ఈ నెల 27, 28న టోకెన్ సమ్మె నిర్వహిస్తునట్లు గురువారం మండ్ల రాజు కార్మికులతో కలిసి కలెక్టరేట్‌లో డీపీఓ సురేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి నిక్సన్, కురుమన్న, లక్ష్మన్న, అనీప్, శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

కాలనీలోకి కస్తూర్బా విద్యాలయం మురుగు



కస్తూర్బా పాఠశాల నుంచి బయటకు వస్తున్న మురుగు

గోపాల్‌పేట: స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాల నుంచి వెలువడే మురుగు నీరు ఏడుట్ల రోడ్డులో ఉండే కాలనీల్లో నిల్వడంతో కాలనీవాసులు దుర్వాసన వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల నుంచి వారం రోజులుగా మురుగు కాలనీలోకి వస్తున్నా సంబంధిత అధికారులు మురుగు నివారణకు చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. గతంలో ఇలా మురుగునీరు వచ్చేది కాదని ఇప్పుడే కాలనీలోకి ఎందుకు వదులుతున్నారని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయం కస్తూర్బాగాంధీ పాఠశాల ఎస్ఓ దీప్తిని వివరణ కోరగా.. పిల్లలు స్నానాలు చేసిన నీరు గుంత ఉంటే అందులోకి వెళ్లేదని, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య పెరిగడంతో నీరు బయటకు వస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు, అధికారులకు చెప్పామన్నారు. పెద్ద కాల్వ నిర్మిస్తేనే సమస్య తీరుతుందని వారు చెప్పారని అన్నారు. వెనకాల వైపు నీటిని పంపాలంటే పట్టా భూములు ఉండడంతో రైతులు అభ్యంతరం తెలిపారన్నారు. దీనిపై మరోసారి అధికారుల దృష్టికి సమస్యను వివరిస్తామని పేర్కొన్నారు.